




సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

చీనీరైతు చిత్తు..!

మామిడి రైతు తరహాలోనే ఇప్పుడు చీనీ రైతు చిత్తవుతున్నాడు. గిట్టుబాటు ధర లేక రైతులు విలవిల్లాడుతున్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర లేకపోవడంతో అతి తక్కువ ధరకే తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఒకవైపు ఉద్యానవన ఉత్సవాలు జరిపి పెద్దఎత్తున ఉద్యానవన రైతుకు ప్రోత్సాహం అందిస్తున్నట్టు చేసిన ప్రకటనలేవి ఆచరణలో కనిపించడం లేదు. ఈ ఏడాది ఫిబ్రవరిలో అనంతపురం నగరంలో ఉద్యానవన ఎన్‌క్లేవ్ నిర్వహించి పెద్దఎత్తున ఉద్యానవన రైతుకు ప్రోత్సహిస్తామన్న ప్రకటనలు అధికారులు, ప్రజాప్రతినిధులు ఇచ్చారు. ఆచరణలో నష్టపోతున్న రైతుకు అందుతున్న సహాయం ఏ మాత్రం ఉండటం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



◆ పతనమైన చీనీ ధర
◆ గిట్టుబాటు ధర లేక రైతు దిగాలు
◆ వ్యాపారుల దోపిడీ మరోవైపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాలో 91,886 ఎకరాల్లో చీనీపంట ఉంది. ఏటా 5.21 లక్షల మెట్రిక్ టన్నులు చీనీ దిగుబడి వస్తుంది. రాష్ట్రంలో ఇంత పెద్దఎత్తున దిగుబడి వచ్చే జిల్లా మరొకటి లేదు. ఏడాదికి సగటున రూ.1562 కోట్ల టర్నోవర్ ఒక్క చీనీ వ్యాపారం ద్వారానే జరుగుతుంది. ఇంత పెద్దఎత్తున సాగయ్యే ప్రాంతంలో రైతుకు సరైన గిట్టుబాటు ధర కల్పించే పరిస్థితి కనిపించడం లేదు. ఒకవైపు పెట్టుబడులు పెరిగాయి. మరో వైపు సరైన గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. అనంతపురం నగరంలో ఉన్న వ్యవసాయ మార్కెట్‌కు రోజుకు వెయ్యి టన్నుల వరకు చీనీ పంట వస్తోంది. గరిష్టంగా టన్ను రూ.16 వేల వరకు మాత్రమే ధర పలుకుతోంది. కనిష్టంగా పది వేలకు లోపే ఉంది.

సాధారణంగా అయితే టన్ను రూ.40 వేల నుంచి రూ.50 వేల వరకు ఉంటేనే గిట్టుబాటు అవుతుందని రైతులు వాపోతున్నారు. వర్షాల వలన డిమాండ్ లేకపోవడంతో ధర పడిపోయిందని వ్యాపారులు చెబుతున్నారు.

కొనసాగుతున్న వ్యాపారుల దోపిడీ

ధర లేకపోవడం ఒకవైపు ఉంటే.. వ్యాపారుల దోపిడీ మరోవైపు కొనసాగుతోంది. అనంతపురం నగరంలోని మార్కెట్ యార్డులోనే నిర్ణీత కమీషన్ కంటే ఎక్కువ రైతుల నుంచి వసూలు చేస్తున్నారు. ఈ-నామ్ పద్ధతి ప్రకారమైతే నాలుగు శాతమే కమీషన్ వసూలు చేయాలి. ఇక్కడ మాత్రం పది శాతం వరకు వసూలు చేస్తున్నట్టు ఆరోపణలున్నాయి. ఇక నేరుగా తోటల వద్దకెళ్లి వ్యాపారులు కొనుగోలు చేస్తే 25 శాతం సూటు ఇవ్వాలి. అంటే పది టన్నులకు రెండున్నర టన్నుల కాయలు ఉచితంగా సూటు కింద వ్యాపారి రైతులు ఇవ్వాలి. ఇలా రెండు విధాలుగానూ రైతులు నష్టపోతున్నారు.

పెట్టుబడులు పెరిగాయి.. ధర లేదు

నాలుగున్నర ఎకరాల్లో చీని పంట సాగుచేశాను. నాలుగైదేళ్లు పంటను కాపాడుకున్న తరువాత దిగుబడులొస్తాయి. ఇంత కష్టపడి సాగుచేసి పంట చేతికొచ్చాక ధర ఉండటం లేదు. ఇంకోవైపు ఈసారి అనేక తెగుళ్లు వ్యాపించాయి. వాటి నుంచి రక్షించుకోవడానికి పెద్ద ఎత్తున మందులు వాడాల్సి వస్తోంది. వాటి ధరలు పెరిగాయి. అన్ని రకాలుగా కష్టాలుపడి సాగు చేసి పంటను మార్కెట్‌కు తీసుకొస్తే ధర ఏ మాత్రం ఉండటం లేదు. పెట్టిన పెట్టుబడులు కూడా రావడం లేదు.

**సుదర్శన్‌రెడ్డి, చీని రైతు
కత్రిమల గ్రామం, పామిడి మండలం.**

ప్రభుత్వం ఆదుకోవాలి

ఉద్యానవనానికి పెద్దఎత్తున ఊతమిస్తున్నామని ప్రభుత్వాలు ప్రకటిస్తున్నాయి. అనంతపురం జిల్లాను హబ్‌గా మారుస్తామని చెబుతున్నారు. ఇప్పటికే మామిడి, మిర్చి రైతులు ధరల లేక తీవ్రంగా నష్టపోయారు. ఇప్పుడు ఆ జాబితాలోకి చీనీ రైతులు చేరిపోయారు. టన్ను రూ.50 వేల వరకు పోతేగాని గిట్టుబాటు ఉండదు. మార్కెట్‌లోనేమో ధర రూ.16 వేల వరకే ఉంది. మామిడి రైతులకు రాయితీ ఇచ్చినట్టుగానే చీనీ రైతులకు ఇవ్వాలి. అదే విధంగా ఈ-నామ్ పద్ధతిలో వ్యాపారులు కుమ్మక్కవడంతో రైతులకు సరైన ధర రావడం లేదు. వేలం పాట ద్వారానే అమ్మకాలు చేపట్టాలి.

**శివారెడ్డి, ఎపి పండ్లతోటల
రైతు సంఘం జిల్లా నాయకులు**

పారదర్శకంగా ఉచిత ఇసుక సరఫరా

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఉచిత ఇసుక సరఫరాను పటిష్టంగా పారదర్శకంగా అమలు చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. కమిటీ సభ్యులతో పాటు ఎస్పీ రత్న, కమిటీ వైస్ ఛైర్మన్, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, జిల్లా గనుల శాఖ అధికారి ఎన్.ఓబుల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇసుక రవాణాను సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో అమలు చేయాలన్నారు. ఇసుక రీచ్‌లో రెవెన్యూ, పోలీస్ సిబ్బందితో నిరంతరం గట్టి పర్యవేక్షణ ఏర్పాటు చేయాలన్నారు. ఇసుక సరఫరా కేంద్రాల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, వీటి పనితీరును నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అంతర్ రాష్ట్ర ఇసుక రవాణా నిరోధించే మార్గాల్లో పోలీసులు సమన్వయంతో ఏర్పాటు చేసిన సరిహద్దు చెక్‌పోస్టుల్లో అక్రమ రవాణా జరగకుండా గట్టి పర్యవేక్షణ ఉండాలన్నారు. హంద్రీనీవా కాలువ పనులకు అవసరమైన ఇసుకను సంబంధిత అధికారుల అనుమతితో తీసుకువెళ్లాలన్నారు. 2021 నుంచి 2024 వరకు ఈ మధ్యకాలంలో జరిగిన ఇసుక అక్రమ తవ్వకాలపై తగిన నివేదికలు ఆధారంగా అక్రమ తవ్వకాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. ప్రవాహాలకు ఆనుకుని ఉన్న గ్రామాల్లో ప్రజల వ్యక్తిగత ఉపయోగం లేదా ప్రభుత్వ కార్యాలయాలకు అవసరమైన ఇసుకను ఎద్దుల బండ్లు, ట్రాక్టర్లు ద్వారా, మనుషుల ద్వారా తవ్వకాలు జరిపి రవాణాకు అనుమతి ఇవ్వాలన్నారు. ఇసుక అక్రమ రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, డిపిఒ సమత, భూగర్భ జలాల శాఖ అధికారి రాజశేఖర్, డీఎస్పీ విజయ్ కుమార్, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

జిల్లాకు 15 మంది ప్రొబేషనరీ ఎస్ఐలు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్యసాయి జిల్లాకు కొత్తగా 15 మంది ప్రొబిషనరీ సబ్ ఇన్స్‌పెక్టర్లను కేటాయించినట్లు ఎస్పీ వి రత్న తెలిపారు. బుధవారం శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ కార్యాలయంలో నూతన ఎస్ఐలతో సమావేశం నిర్వహించిన ఎస్పీ విధుల పట్ల దిశానిర్దేశం చేశారు. పోలీసు విధుల్లో అత్యంత కీలకమైన శాంతి భద్రతలను కాపాడడం, నేరాలను అరికట్టడం, నేరస్తులను పట్టుకోవడం, ట్రాఫిక్ క్రమబద్ధీకరణ, క్రైం అగనెస్ట్ ఉమెన్ , సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల అనర్థాలు, తదితర అంశాలపై పలు సూచనలు చేశారు. గ్రామాలు, పట్టణాలలో ప్రజలతో మమేకమై, వారి సమస్యలను తెలుసుకుంటూ, వాటిని పరిష్కరించడానికి కృషి చేయాలన్నారు. ఐదు నెలల కాలంలో బాగా పనిచేసి జిల్లాలో పోలీసుశాఖ ప్రతిష్ట పెరిగేలా ప్రజలకు సేవలందించాలని ఎస్పీ సూచించారు. ఈ కార్యక్రమంలో, ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యం రెడ్డి, ఆర్ఐలు వలి మహేష్, సోషల్ మీడియా ఎస్ఐ ముని ప్రతాప్ పాల్గొన్నారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కదిరి టౌన్

సౌత్ ఇండియా ఇన్విటేషనల్ ఛాంపియన్‌షిప్‌లో మెరిసిన కడప మునిసిపల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన సౌత్ ఇండియా ఇన్విటేషనల్ కరాటే ఛాంపియన్‌షిప్ - 2025లో సెయింట్ థామస్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. వివిధ వర్గాల్లో పోటీపడి పలు మెడల్స్‌ను సాధించి తమ శ్రమను నిజం చేసి, పాఠశాల కీర్తిని దక్షిణాది స్థాయిలో చాటారు.ఈ ఛాంపియన్‌షిప్‌లో డింబు శ్రీ కుమితే విభాగంలో రెండవ స్థానం, కటా విభాగంలో మూడవ స్థానం సాధించింది. వర్షిత, జస్వంత్, ఫర్హాన్ వేర్వేరువర్గాల్లో కటాలో మూడవ స్థానం సాధించగా, యశ్వంత్ రెండవ స్థానం గెలిచి తన ప్రతిభను నిరూపించుకున్నారు. ప్రతిభా విద్యార్థులను కరాటే కోచ్ షేక్షావలి, సెయింట్ థామస్ పాఠశాల ప్రిన్సిపల్ షబ్బీర్, స్కూల్ స్టాఫ్ సుదర్శన్ , సాంబ పీ.ఈ.టీ జగదీష్ , విద్యార్థుల తల్లిదండ్రులు ప్రతిభా విద్యార్థులను అభినందించారు.



సర్టిఫికెట్లతో ప్రతిభా విద్యార్థులు

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ధ్యేయమనిపుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. బుధవారం పుట్టపర్తి మండల పరిధిలోని కప్పలబండలో నిర్వహించిన సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈసందర్భంగా గ్రామస్తులు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. వాటి పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఎమ్మెల్యే అదేశించారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి, టిడిపి మండల కన్వీనర్‌తో పాటు పెడబల్లి ప్రాథమిక సహకార సొసైటీ అధ్యక్షులు విజయకుమార్, సర్పంచి పెద్దన్న ,ఎంపీటీసీ మధురిమ, గోపాల్, మారుతి నాయుడు, మాజీ జెడ్పిటిసి శ్రీ రామ్ నాయక్, బొమ్మయ్య, వెంగళమ్మ చెరువు సింగల్ విండో అధ్యక్షుడు శ్రీరామ్ రెడ్డి పాల్గొన్నారు.

పేద కుటుంబాలకు అండగా ఉంటాం

బుక్కపట్నం : కష్టాల్లో ఉన్న పేద కుటుంబాలను అన్ని విధాలుగా ఆదుకుంటామనిఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని జానకం పల్లిలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన దెయ్యాల పోతప్ప కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. మృతుడు పోతప్ప సతీమణి గంగమ్మను పరామర్శించి ఆర్థిక సహాయాన్ని అందజేశారు. అదేవిధంగా రోడ్డు ప్రమాదంలో కాలు దెబ్బతిన్న పెద్దన్నను పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన వెంకట్రాంరెడ్డి, వడ్డే దాసన్న కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లి రెడ్డి టిడిపి నాయకులు గంగాధర్, శ్రీనివాస్ రెడ్డి, మురళి, సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు పుట్టపర్తికి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ డాక్టర్ రాయపాటి శైలజ పుట్టపర్తి పర్యటనకు రానున్నారు. గురువారం ఉదయం 10 గంటలకు స్థానిక సాయి ఆరామం అతిథి గృహంలో మహిళల భద్రత తీసుకోవలసిన చర్యలు తయారు అంశాలపై మహిళలకు అవగాహన సదస్సు నిర్వహిస్తారు. ఈ సమావేశానికి మహిళా సంఘాల ప్రతినిధులు, ప్రజా ప్రతినిధులు పాల్గొనాలని కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన వెలువడింది.

వడ్డెర సంఘం పుట్టపర్తి నియోజవర్గ ప్రధాన కార్యదర్శిగా కుంచపు ఆంజనేయులు

ప్రజాశక్తి -ఓబుళదేవర చెరువు

వడ్డెర, వడియ రాజుల సంక్షేమ సంఘం పుట్టపర్తి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా ఓ.డి చెరువు మండలం నల్లగుట్లపల్లికి చెందిన కుంచపుఆంజనేయులును ఎంపిక చేశారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ తనను గుర్తించి నియోజకవర్గం ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షురాలు అడ్వకేట్ వేముల బేబీ రాణికి, యువజన రాష్ట్ర కన్వీనర్ డేరంగుల ఆంజనేయులుకుచ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మంజునాథకు కృతజ్ఞతలు తెలిపారు. వడ్డెర సంక్షేమ సంఘం అభివృద్ధికి కషి చేస్తానని తెలిపారు.

డీలర్ల సంఘం అధ్యక్షులుగా హరి

ప్రజాశక్తి - బుక్కపట్నం

మండల డీలర్ సంఘం అధ్యక్షుడిగా లింగప్ప గారి పల్లి హరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బుధవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయ ఆవరణంలో డీలర్ల సంఘం సమావేశాన్ని నిర్వహించి లింగప్ప గారి పల్లి గ్రామానికి చెందిన హరిని అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా హరి మాట్లాడుతూ డీలర్లకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మల్లిరెడ్డి, నాయకులు గంగాధర్, చెన్నకృష్ణ, ఎర్ర కేసి, డీలర్లు, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



డీలర్లసంఘం అధ్యక్షుడిని అభినందిస్తున్న మండలంలోని డీలర్లు, నాయకులు

మహిళలు, ఆడపిల్లల భద్రతే లక్ష్యం

రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ డా॥రాయపాటి శైలజ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

రాష్ట్రంలో మహిళలు, ఆడపిల్లల భద్రతే లక్ష్యంగా మహిళా కమిషన్ పని చేస్తోందనిరాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా॥రాయపాటి శైలజ స్పష్టం చేశారు. బుధవారం ఆమె అనంతపురంలో పర్యటించారు. పలు కార్యక్రమాల్లో ఆమె పాల్గొని, అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కళాశాలలో జిల్లా మహిళా శిశు , సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళల సంక్షేమం, భద్రత సాధికారతపై ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి అవగాహన సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ మాట్లాడుతూ సమాజంలోని ప్రతి ఒక్కరికీ మహిళల చట్టాలపై సంపూర్ణ అవగాహన ముఖ్యమన్నారు. ఎక్కడైనా ఏదైనా ఒక ఘటన జరిగినప్పుడే కాకుండా వాటిని ముందస్తుగా నివారించడానికి చర్యలు తీసుకోవడం ప్రధానమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళా భద్రతకు కట్టుబడి ఉందన్నారు. బాల్య వివాహాలు , గృహహింస, మహిళ ఉద్యోగులపై వేధింపులు తదితర వాటిని నిర్మూలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. మహిళలు, యువతులు శక్తి యాప్‌ను వారి సెల్‌ఫోన్లో డౌన్లోడ్ చేసుకోవాలని సూచించారు. ఆపద సమయంలో ఈ యాప్ అపన్నహస్తంలా నిలుస్తుందని తెలిపారు. ఏదైనా సమస్య ఎదురైతే ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలన్నారు. అంతకుముందు జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు ద్వారా చేపట్టిన కార్యక్రమాల స్టాల్‌ను సందర్శించారు. గృహహింస చట్టంపై రూపొందించిన గోడ పత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఆర్డీవో కేశవ నాయుడు, జిల్లా ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగమణి, డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి, మాజీ నగర మేయర్ స్వరూప, దిశా పోలీస్ స్టేషన్ సిఐ వెంకటేశ్వర్లు, నోడల్ అధికారి వనజాక్షి తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా॥రాయపాటి శైలజ

కామ్రేడ్ అచ్యుతానందన్ మృతికి నివాళి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

కేరళ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ అచ్యుతానందన్ మృతికి సిపిఎం స్థానిక నాయకులు నివాళి అర్పించారు. పట్టణంలోని సిపిఎం కార్యాలయంలో అచ్యుతానందన్ చిత్ర పటానికి నివాళు లర్పించడం జరిగింది.. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా నాయకులు జంగాలపల్లి పెద్దన్న, పట్టణ కార్యదర్శి ఏ మారుతి, సిఐటియు జేవీ రమణ ఎస్ఎఫ్ఐ నామాల నాగార్జున మాట్లాడుతూ కామ్రేడ్ అచ్యుతానందన్ మృతి కమ్యూనిస్టు ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. ఆయన ఆశయాలు కొనసాగించడమే నిజమైన నివాళి ని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అనిల్, అమన్, రాజు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ : సిపిఎం ఆధ్వర్యంలో కేరళ మాజీ ముఖ్యమంత్రి విఎస్ అచ్యుతానందన్ మృతికి బుధవారం నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఎం సీనియర్ నాయకులు హరి మాట్లాడుతూ అచ్యుతానందన్ మృతికి పార్టీకి, కమ్యూనిస్టు ఉద్యమానికి తీరని లోటు అని అన్నారు. ఆయన ఆశయాలను కొనసాగించాల్సిన బాధ్యత ఈ తరం నాయకులపై ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో నాయకులు బాబావలి, తిప్పన్న, నరసింహ, ఆనంద్, ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.





అచ్యుతానందన్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

'భద్రత - బాధ్యత'పై ఆటో డ్రైవర్లకు అవగాహన



ఆటోడ్రైవర్లతో ఎస్పీ, తదితరులు

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

ఆటోలు నడపడం అంటే కేవలం ప్రయాణికులను గమ్యానికి చేర్చడం మాత్రమే కాదని సమాజాన్ని మంచివైపు నడిపించేందుకు ఆటో డ్రైవర్లు విధి నిర్వహణలో భద్రంగా ఉంటూ బాధ్యతగా మెలగాలని శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ రత్న పిలుపునిచ్చారు. బుధవారం పుట్టపర్తి లోని సాయి ఆరామంలో పుట్టపర్తి సబ్ డివిజన్ డీఎస్పీ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో పోలీసు శాఖ ఆటో డ్రైవర్లకు 'భద్రత– బాధ్యత' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించడంతో పాటు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా జిల్లా ఎస్పీ వి.రత్న, జిల్లా వైద్యశాఖ అధికారి ఫైరోజ్ బేగం హాజరై ఆటో డ్రైవర్లకు దిశా నిర్దేశం చేశారు. అసాంఘిక శక్తుల సమాచారాన్ని పోలీసులకు అందించడంలో ఆటో డ్రైవర్లు ఎప్పుడు ముందుండాలని ఎస్పీ సూచించారు. లిక్కర్, గంజాయి మొదలైన చెడు వ్యసనాలకు ఆటోడ్రైవర్లు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆటోలకు తప్పనిసరిగా వెహికల్ ట్రాఫికింగ్ సిస్టమ్ అమర్చుకోవాలన్నారు. ఏవైనా సంఘటనలు జరిగినప్పుడు వాహనం ఎక్కడుందో గుర్తించడానికి ఇది చాలా ఉపయోగపడుతుందన్నారు. సత్య సాయి బాబా శతజయంతి వేడుకలకు పుట్టపర్తి కి వచ్చే ఇతర రాష్ట్రాలు, దేశాల భక్తులతో ఉత్తర ప్రత్యుత్తరాలు నెరపడానికి ఆటో డ్రైవర్లకు భాషా పరమైన సమస్య ఎదురవుతుందన్నారు. అందుకే ఆంగ్లం, హిందీ భాషల్లో పట్టు పెంచుకోవాలన్నారు. సుదూర ప్రాంతాలకు ప్రయాణికులను చేరవేసే క్రమంలో ఆటో డ్రైవర్లు ఆరోగ్యపరమైన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆడపిల్లలు మహిళలపై జరిగే నేరాలను అడ్డుకోవడంతోపాటు, ఆ వివరాలను పోలీసులకు సకాలంలో చేరవేసేందుకు ఆటో డ్రైవర్లు ముందుండాలన్నారు. సమాచారం ఇచ్చే ఆటో డ్రైవర్ల వ్యక్తిగత వివరాలను రహస్యంగా ఉంచుతామన్నారు. ఈ కార్యక్రమంలో మోటార్ వెహికల్ ఇన్స్‌పెక్టర్ వరప్రసాద్, పుట్టపర్తి, నల్లమాడ, పుట్టపర్తి రూరల్, సీఐలు సునీత, సురేష్, నరేందర్ రెడ్డి, మారుతి శంకర్ , ఎస్సైలు మల్లికార్జునరెడ్డి, కృష్ణమూర్తి, వైద్య సిబ్బంది , పుట్టపర్తి సబ్ డివిజన్లోని 800 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

చదువుకు వైకల్యం అడ్డుకాదు

ప్రజాశక్తి-హిందూపురం

చదువుకు అంగవైకల్యం ఏమాత్రం అడ్డు కాదని మున్సిపల్ చైర్మన్ డిఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించిన ఆరుగురు వికలాంగ విద్యార్థులకు ఐటిఐలో ప్రవేశం కల్పించారు. ఈ సందర్భంగా ప్రవేశం పొందిన ఆరుగురు విద్యార్థులను స్థానిక భవిత కేంద్రం వద్ద ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఛైర్మన్ రమేష్ కుమార్, బాలయ్య పీఏ వీరయ్య, ఎంఈఓ గంగప్ప, జిల్లా సమగ్ర శిక్షా అదనపు ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దేవరాజ్, కోఆర్డినేటర్ ఆనందబాబు పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, హిందూపురం మండలంలోని భవిత కేంద్రంలో వికలాంగత్వం ఉన్న దివ్యశ్రీ, మంజుశ్రీ, సుహానా, ఆజామ్, సాయి శర్వాన్, గాయిత్రి ఆరుగురు విద్యార్థులు పదవ తరగతిలో ఉత్తీర్ణత సాధించి చదువుకు వైకల్యం అడ్డు కాదని నిరూపించారన్నారు. ఆ ఆరుగురు విద్యార్థులను ఐటిఐ మేనేజ్ మెంట్‌తో చర్చించి జాబ్ గ్యారంటీ కూడా తీసుకొని ఐటిఐలో ప్రవేశం చేయించడం గొప్ప విషయమన్నాం అనంతరం ఎంఈఓ ఎహెచ్. గంగప్ప ఆధ్వర్యంలో విద్యార్థులను ఘనంగా సన్మానించారు. భవిత కేంద్రంలో పదవ తనగతిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు అభినందన సభ ఏర్పాటు చేస్తామని చెప్పిన వెంటనే పాంచజన్య పాఠశాల నిర్వహకులు శ్రీనివాసులు, దీప్తీ పాఠశాల లూసీ, క్రిష్టప్ప ముందుకు వచ్చి సహాయ సహకాలను అందించడంతో వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో -2 ప్రసన్నలక్ష్మి, ఎంజిఎం పాఠశాల హెచ్ఎం రంగనాయకులు, దుర్గాబాయ్ దేశ్ ముఖ్ హెచ్ఎం. సూర్యనారాయణ, జిల్లా వినియోగదారుల సంఘం అధ్యక్షులు కిష్టప్ప, భవిత టీచర్స్ లలిత, నందిని తదితరులు పాల్గొన్నారు.



వికలాంగ విద్యార్థుల సన్మాన కార్యక్రమం



తిరుపాల్‌నాయుడిని సన్మానిస్తున్న నాయకులు

మార్కెట్ యార్డ్ డైరెక్టర్‌కు సన్మానం

ప్రజాశక్తి - రొద్దం

పెనుగొండ మార్కెట్ యార్డ్ డైరెక్టర్ తిరుపాల్ నాయుడును తెలుగుదేశం పార్టీ మండల నాయకులు ఘనంగా సన్మానించారు. మండల నాయకులు శ్రీనాథ్ చౌదరి ఆధ్వర్యంలో బుధవారం మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో తిరుపాల్‌నాయుడిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిన్నప్పయ్య, చిరంజీవి, చెన్నకేశవులు, క్రిష్టప్ప, సిద్దన్న, ఉమాశంకర్, హరీష్, మధు, సదాశివరెడ్డి, క్రిస్టఫర్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

ప్రజాశక్తి - లేపాక్షి

మండల పరిధిలోని కోడిపల్లి ప్రాథమిక పాఠశాల, తిలక్ నగర్ ప్రాథమిక పాఠశాల లో చదివే విద్యార్థులకు చేయూత చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రిని బుధవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా నోటుపుస్తకాలు, పెన్నులు అందచేశారు. ఈ కార్యక్రమంలో చేయూత ట్రస్ట్ సభ్యులు విశ్వేశ్వరయ్య, అయన కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు నాగరాజు, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఆలయ హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - నల్లచెరువు

శ్రీ పాలపాటిదిన్నె ఆంజనేయస్వామి శాశ్వత హుండీ ఆదాయాన్ని బుధవారం లెక్కించారు. 11-03-2025 నుంచి 23-07-2025 వరకు రూ. 2,85,150ల ఆదాయం సమకూరిందని ఈవో మురళీకృష్ణ, తనిఖీ అధికారి ప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు నాగరాజు ,ఆంజనేయ దాస్, సంజీవ్, రెడ్డెప్ప ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు అవగాహన

ప్రజాశక్తి - గుడిబండ

గుడిబండ పోలీస్ స్టేషన్లో ఆటోడ్రైవర్లకు గుడిబండ ఎస్ఐ రాజకుల్లయప్ప అవగాహన కల్పించారు. మడకశిర సిఐ రాజకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ఆటోడ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు.

తనకల్లు :ఆటో డ్రైవర్లు రోడ్డు నిబంధనలను పాటించాలని ఎస్‌క్మి గోపీ ఆదేశించారు.మండల పరిధిలోని కొక్కంటి క్రాస్ లో బుధవారం ఆటో డ్రైవర్లతో పోలీస్ అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు రోడ్డు భద్రతా నియమాలు, ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాద నివారణ చర్యలపై వారికి అవగాహన కల్పించారు. ఆటో డ్రైవర్ యూనిఫామ్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగ సుబ్బయ్య, పోలీసులు పాల్గొన్నారు.

పెనుకొండ : రోడ్డు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని పెనుకొండ సిఐ రాఘవన్ ఆటో డ్రైవర్లను హెచ్చరించారు. బుధవారం పట్టణంలో జూనియర్ కళాశాల క్రీడామైదానంలో ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఆటోలలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించరాదన్నారు. మద్యం సేవించి ఆటోలు, ఇతర వాహనాలను నడపరాదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసు సిబ్బంది ఆటో డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్లతో రూరల్ సిఐ జనార్ధన్ బుధవారం సమావేశం నిర్వహించి రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పించారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్ట పరమైన చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది జనార్ధన్, వెంకటేషులు ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

బీసీ హాస్టల్ తనిఖీ

ప్రజాశక్తి - గోరంట్ల

పట్టణంలో బీసీ హాస్టల్‌ను ఎంపీడీవో నరేంద్ర కుమార్ బుధవారం తనిఖీ చేశారు ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు మెనూ ప్రకారం విద్యార్థులకు ఆహారం అందించాలని సిబ్బందిని ఆదేశించారు. హాస్టల్లో ఉన్న గదులను పరిశీలించారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

ప్రజాశక్తి - గాండ్లపెంట

పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి బాబా ఫకద్దీన్ అన్నారు. మండల పరిధిలోని కటారపల్లి క్రాస్ వద్ద ఉన్న కస్తూరీబా పాఠశాలలో బుధవారం పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ విజయ్ కుమార్, సూపర్‌వైజర్ ఉపేందర్ రెడ్డి, ఎస్ఒ దుర్గ, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు

ఎరువులు అందుబాటులో ఉంచండి

ప్రజాశక్తి - లేపాక్షి

రైతులకు అవసరమైన ఎరువులను సచివాలయంలో అందుబాటులో ఉంచాలని వ్యవసాయ సంచాలకులు క్రిష్ణయ్య సూచించారు. బుధవారం మండలం పరిధిలోని కంచి సముద్రం గ్రామంలో నిర్వహించిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా రైతులకు పంటసాగు, సస్యరక్షణ చర్యలపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఒ శ్రీలత, సర్పంచి, ఎఇఒ అమరేష్ రెడ్డి, ఇన్సూరెన్సు కంపెనీ ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

గుడిబండ :మండల పరిధిలోని జమ్మలబండ,కొంకల్లు,గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఎఇఒలు మంజుల, శారద, రైతుసేవ కేంద్రం అధికారులు హిమబిందు, కవితమ్మ, ప్రకాష్ తదితరులతో పాటు రైతులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్ట చర్యలు

కలెక్టర్ టిఎస్ చేతన్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్, ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

మాదకద్రవ్యాల నిరోధానికి పటిష్టమైన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్లో జిల్లా లో మాదకద్రవ్యాల నివారణ, అక్రమ రవాణా నిరోధంపై జిల్లా ఎస్పీ రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌తో కలసి కలెక్టర్ సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మాదకద్రవ్యాల సరఫరా రవాణాను అరికట్టేందుకు జిల్లాలో పటిష్టమైన నిఘా చర్యలు చేపట్టాలన్నారు. డ్రగ్స్ వాడకం, రవాణా పై సమాచారం అందించేందుకు టోల్ ఫ్రీ నెంబరు 1972ను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సమాచారం అందించే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామన్నారు. ముఖ్యంగా విద్యార్థులు, ఆటో డ్రైవర్లను లక్ష్యంగా చేసుకొని సరఫరా జరిగే అవకాశాలు ఎక్కువగా ఉందన్నారు. వారిపై నిఘా ఉంచాలన్నారు. డ్రగ్స్ అమ్మినా, వినియోగించినా, సరఫరా చేసినా నేరమన్నారు. విద్యాసంస్థలలో ఈగల్ క్లబ్బులను ఏర్పాటు చేయాలని డిఇఒ క్రిష్టప్పను, జిల్లా ఒకేషనల్ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. స్వచ్ఛంద సంస్థల సహకారం తీసుకోవాలని డ్రగ్స్ వల్ల జరిగే అనర్థాలు, నష్టాలు కుటుంబాలు విచ్ఛిన్నం గురించి కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎస్పీ రత్న మాట్లాడుతూ, జిల్లాలో మాదగద్రవ్యాల వినియోగం, రవాణా అరికట్టడానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు హాస్టల్లో డ్రగ్స్ వినియోగం జరగకుండా కళాశాలలు ముందు గోడ పత్రికల ద్వారా ప్రచారం చేయాలన్నారు. ఈ సమావేశంలో ధర్మవరం ఆర్డీవో మహేష్, డిపిఒ సమత, ఐసిడిఎస్ పీడీ శ్రీదేవి, సంబంధిత అధికారులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పి - 4 లక్ష్యం

సబ్ కలెక్టర్ ఆనంద్‌కుమార్

ప్రజాశక్తి - రొద్దం

పేదరిక నిర్మూలనే పి-4 లక్ష్యమని పెనుగొండ సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ అన్నారు. పి-4 కార్యక్రమం లో భాగంగా మండలంలోని తురకలపట్నం సచివాలయంలో బుధవారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ ఆనంద్ కుమార్ మాట్లాడుతూ స్వర్ణాంధ్ర 2047 దర్శనిక కార్యక్రమం కింద ప్రభుత్వం ప్రవేశపెట్టిన పి4 కార్యక్రమం గురించి వివరింఆచరు. పేదలను దత్తత తీసుకునేందుకు ధనికులు, ఉన్నత స్థాయి ఉద్యోగస్తులు, సాఫ్ట్వేర్ తదితర వారు ముందుకు రావాలన్నారు. ఒక్కొక్కరు ఒకటి లేదా రెండు కుటుంబాలు దత్తత తీసుకొని వారిని పేదరికం నుంచి గట్టెక్కించడానికి కృషి చేయాలని ఆయన కోరారు. అనంతరం మండల కేంద్రంలోని ఆర్. మరవ పల్లి గ్రామంలో ఉన్న కేజీబీవీ గురుకుల పాఠశాలను తనిఖీచేశారు. మూడు సంవత్సరాలుగా ఈ పాఠశాల నందు 10వ తరగతి ఫలితాలు వందశాతం రావటంపై ప్రిన్సిపల్ నాగరత్న, సిబ్బందిని అభినందించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఉదయ శంకర్ రాజ్, ఎంపీడీవో రామకుమార్, వీఆర్వోలు రామమోహన్, అనిల్ కుమార్, ప్రిన్సిపల్ నాగరత్న, తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



గ్రామసభలో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్



సమావేశంలో పాల్గొన్న నాయకులు

పిఆర్‌సి, ఆర్థిక బకాయిలు చెల్లించాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి - కదిరి టౌన్

ఉద్యోగ ఉపాధ్యాయులకు పిఆర్‌సి, పెండింగ్లో ఉన్న ఆర్థిక బకాయిలు విడుదల చేయాలని యుటిఎఫ్ సీనియర్ నాయకులు శ్రీనివాసులు డిమాండ్ చేశారు. స్థానిక ఎన్‌జిఒ హోంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ కదిరి డివిజన్ ప్రాంతీయ సమావేశం యుటిఎఫ్ జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు మల్లికార్జున అధ్యక్షతను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా యుటిఎఫ్ సీనియర్ నాయకులు వెలిచెలిమల శ్రీనివాసులు, జిల్లా కోశాధికారి శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శులు చెన్నూరు తాహెర్‌వలి , వై వి సుబ్బారెడ్డి హాజరయ్యారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులకు 12 వ పీఆర్సీ అమలు చెయాలని, ఆర్థికబకాయలు చెల్లించాలని, డిఎలు మంజూరు చెయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఆజం బాషా , సునీల్ కుమార్ సంతోష్ కుమార్, నాయకులు గౌస్ ఖాన్, ఆనంద్, మధుసూదన్, రెడ్డి రాజేష్, నాగరాజు, రమణ నాయక్, ఖాదర్ భాషా, రవివర్ధన్ రెడ్డి, నజీర్, కాజా, గణేష్, మనోహర్, బాలాజీ నాయక్, ఖాజాపీర్, రమేష్ బాబు, సుధాకర్‌తో పాటు కదిరి ప్రాంతంలోని 10 మండలాల యుటిఎఫ్ నాయకులు పాల్గొన్నారు.

మడకశిర అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా.?


వైసిపి సమన్వయకర్త ఈరలక్కప్పకు ఎమ్మెల్యే రాజు సవాల్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్. రాజు

ప్రజాశక్తి - మడకశిర టౌన్

మడకశిర నియోజకవర్గంలో ఎవరి ప్రభుత్వ హయాంలో అభివృద్ధి జరిగిందో బహిరంగ చర్చకు సిద్ధమా అని స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్. రాజు వైసిసి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్పకు సవాల్ విసిరారు. ఏధవారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. తమ ప్రభుత్వంలోని సంవత్సరం కాలంలో తాను ఎమ్మెల్యే అయ్యాక రూ.10,710కోట్లతో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామన్నారు. నియోజకవర్గ ప్రజలు జరుగుతున్న అభివృద్ధిని గమనించాలని కోరారు. వైసీపీ నేతల తప్పుడు ఆరోపణలు, అసత్య ప్రచారాలు నమ్మవద్దని కోరారు. ఈ ఏడాది కాలంలో తాను చేపట్టిన అభివృద్ధి పనులపై త్వరలోనే శ్వేతపత్రం విడుదల చేస్తామని చెప్పారు. తాను విడుదల చేసే శ్వేతపత్రంపై బహిరంగ చర్చ నిర్వహిద్దామని చెప్పారు. గుడిబండ, రోళ్ల, ఆగళి మండలాల వద్ద కూడా త్వరలోనే సోలార్ ప్రాజెక్టులకు సంబంధించిన జీఓలు రాబోతున్నాయని అన్నారు. ఆగష్టు, సెప్టెంబర్ నెలలో ముఖ్యమంత్రి చేతులు మీదుగా శంకుస్థాపనలు జరగబోతుందన్నారు. ప్రతివారం సీఎం సహాయనిది చెక్కుల పంపిణీ జరుగుతోందని అన్నారు. ఈరలక్కప్ప వాస్తవాలు తెలుసుకుని మాట్లాడితే బాగుంటుందని సూచించారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ మూర్తి, మండల కన్వీనర్లు నాయకులు పాల్గొన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'ని విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-హిందూపురం

నాయకులు, కార్యకర్తలు ఐకమత్యంతో వ్యవహరించి 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని వైసిపి నాయకులు గుడ్డంపల్లి వేణు రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం మున్సిపల్ పరిధిలోని ఎనిమిదో వార్డుకు చెందిన పార్టీ శ్రేణులు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆయనను కలిశారు. ఈ సందర్భంగా వేణురెడ్డి మాట్లాడుతూ, వార్డులో అందరూ కలిసికట్టుగా పార్టీ బలోపేతానికి పని చేయాలని సూచించారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో కార్యక్రమాన్ని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో 8వ వార్డు వైసిపి నాయకులు పాల్గొన్నారు.

కాకతీయ విద్యానికేతన్‌లో మాక్ ఎలక్షన్

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం హై స్కూల్‌లో బుధవారం పాఠశాల విద్యార్థులకు మాక్ ఎలక్షన్ నిర్వహించారు. ప్రజాస్వామ్య విధానం పట్ల అవగాహన కల్పించే ఉద్దేశంతో మాక్ ఎలక్షన్స్ (ప్రత్యక్ష ఎన్నికలు) నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ నిర్మలాదేవి మాట్లాడుతూ విద్యార్థులకు చిన్ననాటి నుండే ప్రజాస్వామ్య విలువలపై అవగాహన కలిగించడం కోసం ఈ మాక్ ఎన్నికలు పాఠశాలలో నిర్వహించామని తెలిపారు. పాఠశాల డైరెక్టర్లు శెట్టిపి సూర్య ప్రకాష్ రెడ్డి, శెట్టిపి పద్మ మాట్లాడుతూ ఈ తరహా కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో నాయకత్వ లక్షణాలు అలవడుతాయన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మాక్ ఎలెక్షన్‌లో పాల్గొన్న విద్యార్థులు

సామాజిక సేవలో షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్



ఉచిత వైద్యశిబిరానికి వచ్చిన వారితో శిల్ప

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

పెనుకొండలోని షిర్డీసాయి గ్లోబల్ ట్రస్ట్ అనేక సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పౌష్టికాహార లోపం ఉన్న పిల్లలకు,గర్భిణులకు పౌష్టికాహారాన్ని పంపిణీ చేస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి వద్ద అన్నదాన కార్యక్రమాలను నిర్వహించారు.గతంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు.ఉచితంగా విదేశీ వైద్యులచే వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ప్రజలు ఎదుర్కొంటున్న ఆరోగ్య సమస్యలకు ఉచితంగా వైద్య సేవలు అందించడమే కాక మందుల పంపిణీ, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తున్నారు. అంతేకాక కంటి వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి ఉచితంగా కంటి అద్దాలుతో పాటు కంటి ఆపరేషన్లు కూడా చేయించారు. విద్యాభివృద్ధికి, క్రీడాభివృద్ధికి క్రీడాకారులకు అవసరమైన సహాయ సహకారాలను అందిస్తున్నారు. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా ఉచిత ఆపరేషన్లతో పాటు వైద్య సేవలు అందించి కంటి అద్దాలు మందులను పంపిణీ చేస్తున్నారు. ప్రతి ఏడాది ట్రస్టు తరపున పేద విద్యార్థుల చదువులకు ఆర్థిక సహాయం అందజేస్తున్నారు. గతంలో పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించేందుకు శిల్ప ఆర్థిక సహాయం అందజేశారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ఆమె పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. వినాయక చవితి సందర్భంగా ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ విగ్రహాలను వాడకుండా మట్టి విగ్రహాలను వాడాలని ట్రస్ట్ ఆధ్వర్యంలో చాలా కాలంగా ప్రజల్లో చైతన్యం తెస్తున్నారు. నీటి సంరక్షణ కోసం శిల్పా చర్యలు చేపట్టారు.పెనుకొండ పరిసర ప్రాంతాల్లో ఇంకుడు గుంతలను సొంత నిధులతో తవ్వించారు పట్టణంలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం సొంత నిధులతో బోర్లు వేయించారు. పెనుకొండ పట్టణంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ఛైర్‌పర్సన్ శిల్ప రూ.28 లక్షలు చెక్కును పోలీసు అధికారులకు అందజేశారు. విపత్తుల సందర్భాల్లో ఆర్థిక చేయూతను అందించారు. కరోనా కష్టకాలంలోట్రస్ట్ ఆధ్వర్యంలో సహాయనిధికి రూ. 10లక్షలు,పెనుకొండ సబ్ కలెక్టర్ కు రూ. 5లక్షల విలువైన చెక్కులను అందజేశారు.

నేరాలు ఘోరాలు

అదనపు కట్నం వేధింపులపై కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

మున్సిపాలిటీ పరిధిలోని అడపాల వీధి లో నివాసముంటున్న ఇందుకూరు సింధులత అనే మహిళ ఫిర్యాదు మేరకు ఆమె భర్త ధనుంజయ రెడ్డి పై వరకట్న వేధింపు కేసు నమోదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణ రెడ్డి తెలిపారు. 2013వ సంవత్సరములో కడప పట్టణానికి చెందిన రాజశేఖర్ రెడ్డి కుమారుడైన ఇందుకూరు ధనుంజయ రెడ్డి అనే వ్యక్తికి పట్టణంలోని అడపాల వీధికి చెందిన సింధులతను ఇచ్చి వివాహం చేశారు. వివాహ సమయంలో ఆమె భర్తకు కట్న కానుకల కింద 15 తులాల బంగారు నగలు ఇచ్చి పెళ్లి చేశారు.కొద్ది రోజులు ఆమె కాపురం సజావుగానే సాగింది. భర్త తాగుడుకు బానిసై తనతో గొడవ పెట్టుకుని తనను కొట్టి, తిడుతూ చిత్రహింసలు గురిచేసేవాడని బాధితురాలు సింధులత వాపోయింది. తన భర్త చిన్నాన్న నాగమణింద్రరెడ్డి, చిన్నమ్మ నాగలక్ష్మి కలసి తన భర్తకు లేనిపోనివి చెబుతూ తనను పుట్టింటికి వెళ్లి అదనపు కట్నంగా లక్షలు రూపాయలు డబ్బులు తీసుకురావాలని వేధిస్తున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు సిఐ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

కదిరి మున్సిపాలిటీ పరిధిలో అడపాల వీధి లో నివాసమంటూ హైదరాబాదు లో నర్సింగ్ చేస్తున్న లింగాల నవ్య కనపడలేదని ఆమె తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు పట్టణ సిఐ నారాయణరెడ్డి తెలిపారు. హైదరాబాదు నుంచి ఇంటికి వచ్చి, 23 వ తేదీ మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఎక్కడికో వెళ్లిపోయిందని తండ్రి ఈశ్వరయ్య ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

ట్రాక్టర్ ఢీకొని యువకుడు మృతి

ప్రజాశక్తి - పరిగి

జయ మంగళి నది నుండి హిందూపురం వైపుగా అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ ఢీకొన్న ప్రమాదంలో ఊటుకూరుకు చెందిన అఖిల్ కుమార్(20) అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన పరిగి మండలంలో బుధవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెళ్తే ఊటుకూరు గ్రామానికి చెందిన అఖిల్ కుమార్ ముళ్ళ మోత్కుపల్లి లోని శ్రీనివాస ఐటిఐ కళాశాలలో ట్విట్టర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. కాలేజ్ ముగించుకొని తిరిగి మిత్రుడు లోకేష్ తో పాటు ఇంటికి వస్తుండగా శాసనకోట రహదారిలో వేగంగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మతి చెందారు. మిత్రుడు లోకేష్‌కు కాలు విరగడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు. ఎస్ఐ రంగడు యాదవ్ సంఘటన స్థలాన్ని పరిశీలించారు.కాగా ఈ ప్రాంతానికి సమీపంలో జయమంగళి నది ఉండటం ఇక్కడి నుండి రోజు వందలాది ట్రాక్టర్లు ఇసుక ఇతర ప్రాంతాలకు తరలి వెళ్లడంతో రద్దీగా ఉంటుంది. ఈ ఇసుక అక్రమ తరలింపు ట్రాక్టర్ వల్లే తన ఒక కుమారుడు ప్రమాదానికి గురై మృతిచెందాడని మృతుని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



అఖిల్‌కుమార్ (ఫైల్‌ఫొటో)

క్షతగాత్రుడికి పరామర్శ : రోడ్డు ప్రమాదంలో తీవ్రగా గాయపడిన లోకేష్ హిందూపురం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న టిడిపి మండల కన్వీనర్ గోవిందరెడ్డి లోకేష్‌ను హిందూపురం ప్రభుత్వ ఆస్పత్రిలో పరామర్శించారు.మెరుగైన వైద్యం అందించాలని, డాక్టర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి బాలాజీ, మాజీ ఎంపీటీసీ సోమప్ప, స్థానిక టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల పరిధిలోని జాతీయ రహదారి టేకులోడు క్రాస్ వద్ద రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో గోరంట్ల మండలం గౌనిపల్లి కి చెందిన అంజినప్ప(70) అక్కడికక్కడే మృతి చెందాడు. దేమకేతేపల్లి ఎస్సీ కాలనీ కి చెందిన శివకుమార్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల మేరకు రెండు ద్విచక్ర వాహనాలు ఒకదానికొకటి పరస్పరం ఢీకొనడంతో ప్రమాదం జరిగింది. అయితే మరో ద్విచక్ర వాహనదారుడు పారిపోయాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు.

ప్రమాదంలో ఆరుగురికి గాయాలు

ప్రజాశక్తి హిందూపురం

పట్టణ సమీపంలోని శ్రీకంఠాపురం చెరువు కట్టమీద బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆరుగురికి గాయాలు అయ్యాయి. కారు బొలెరో వాహనం ఢీకొన్న ఈ ప్రమాదంలో బొలెరో వాహనంలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలు అయ్యాయి. క్షతగాత్రులు కర్నాటక రాష్ట్రం ధావణగెరే ప్రాంతానికి చెందిన వ్యక్తులుగా పోలీసులు తెలిపారు.. వీరందరూ కొట్నూరు చెరువులో చేపల పట్టడానికి అక్కడి నుంచి పూలకుంట సమీపములో ఉన్న నరసాపురానికి వెళుతున్నారు. లేపాక్షి వైపు నుంచి హిందూపురం పట్టణానికి వస్తున్న కారు ఢీకొనడంతో బొలెరో వాహనం అదుపుతప్పి కట్టమీద నుంచి కిందికి పడింది. ఈ ప్రమాదంలో బొలెరో వాహనం డ్రైవర్ మల్లన్న తో పాటు వాహనంలో ఉన్న బాబు, భైరప్ప, క్రిష్టప్ప, శివన్న, మంజునాథ్, రంజిత్‌కు గాయాలు అయ్యాయి. స్థానికులు గుర్తించి 108 వాహనంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం మండల పరిధిలోని నాగలూరు గ్రామ సమీపంలో బుధవారం పేకాట ఆడుతున్న వారిని అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. పేకాట సావరంపై దాడి చేసి ఆరుగురిని అరెస్టు చేసినట్లు చెప్పారు. వారి వద్ద రూ.36,600 నగదును స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వివరించారు.

కష్టపడిన కార్యకర్తలకు గుర్తింపు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

టిడిపిలో కష్టపడిన కార్యకర్తలకే తగిన గుర్తింపు ఉంటుందని అందుకు నిదర్శనం ముమ్మనేని వెంకటరాముడు అని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి పేర్కొన్నారు. సహకార పరపతి సంఘం అధ్యక్షునిగా ఎన్నికైన వెంకట రాముడు, డైరెక్టర్లతో పుట్టపర్తి సింగిల్ విండో కార్యాలయంలో నిర్వహించిన ప్రమాణ స్వీకారానికి ఎమ్మెల్యేతో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పెద్ద ఎత్తున టిడిపి శ్రేణులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి కన్వీనర్ బోయ రామాంజనేయులు, పెడపల్లి, వెంగళమ్మ చెరువు, గునిపల్లి సింగల్ విండో అధ్యక్షులు విజయకుమార్, శ్రీరామ్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు మాజీ జడ్పిటిసి చెన్నకేశవులు, మాజీ మున్సిపల్ ఛైర్మన్లు తదితరులు పాల్గొన్నారు.

పాత్రికేయుడి కుటుంబానికి పరామర్శ

పుట్టపర్తి పాత్రికేయుడు పెద్ద కమ్మవారిపల్లికి చెందిన ముమ్మనేని క్రిష్టప్ప మృతికి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సంతాపం తెలిపారు. బుధవారం ఆ గ్రామానికి వెళ్లి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. అన్ని విధాల అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

సమస్యల పరిష్కారానికి అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఎంపిడిఒ సాయి మనోహర్ చెప్పారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ గిరక రమాదేవి ఆధ్వర్యంలో బుధవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వివిధ విభాగాలకు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో జరిగిన, జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు తమ గ్రామాల పరిధిలో నెలకొన్న సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో వెంకటేష్ చౌదరి, సర్పంచులు, ఎంపీటీసీలు, ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.